ప్రజాశక్తి

3 వరకు ఉచిత బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: ప్రధానమంత్రి గ్రామీణ కిశాన్ అన్న యోజన పథకం కింద ఉచితంగా సరఫరా చేస్తున్న బియ్యం పంపిణీని డిసెంబర్ మూడవ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా పౌర సరఫర అదికారి శివ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని తహసిల్దార్లు, పౌర సరఫరాల ఉప తహసిల్దార్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వారు ఉచిత బియ్యాన్ని పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రెగ్యులర్ అందిస్తున్న బియ్యం డిసెంబర్ ఒకటవ తేదీ నుండి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. డిసెంబర్ కోటాను ఈ నెల 30వ తేదీలోపు చౌక ధరల దుకాణదారులు సిద్ధం చేసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా పలు చౌకధరల దుకాణాలను, గిడ్డంగులను డిఎస్ఓ తనిఖీ చేసారు.

గిడ్డంగిని పరిశీలిస్తున్న శివప్రసాద్

గిరిజన సమస్యలపై విస్తృత పోరాటాలు

- గిరిజన సంఘం జిల్లా మహాసభలో రాష్ట్ర నేతలు సురేంద్ర, సీతారాం
- రంపచోడవరం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని తీర్మానం



మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు సున్నం రాజయ్య, కుంజా బొజ్జి చిత్ర పటాలకు పూలమాల వేస్తున్న సురేంద్ర, మంతెన సీతారాం, అనంతరం మహాసభలో మాట్లాడుతున్న సీతారాం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

గిరిజనులు సమస్యలపై విస్తృతంగా పోరాటాలు నిర్వహించాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా ద్వితీయ మహాసభ రంపచోడవరం స్వర్ణభారతి మైదానంలోని సున్నం రాజయ్య, కుంజా బొజ్జి నగర్‌లో సోమవారం జరిగింది. మహాసభ ప్రారంభ సూచికగా గిరిజన సంఘం జెండాను సీనియర్ నాయకులు నక్కా సూరిబాబు ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులైన ఆదివాసీ ఉద్యమనాయకులు మాజీ ఎమ్మెల్యేలు సున్నం రాజయ్య, కుంజ బొజ్జి చిత్రపటాలకు రాష్ట్ర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంపచోడవరం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని ప్రవేశ పెట్టిన తీర్మాన్ని జిల్లా మహాసభ ఆమోదించింది. ఈ సందర్భంగా సురేంద్ర, సీతారాం మాట్లాడుతూ బోయ వాల్మీకులు ఎస్టీ జాబితాలో చేర్చే జీవో నెంబర్ 52ను తక్షణమే రద్దు చేయాలన్నారు. జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని, 1/70 చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు సంపూర్ణంగా పునరావాసం కల్పించాలని, అటవీకుల చట్టం 2006ను ప్రతిష్టంగా అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం అటవీ సంవరక్షణ చట్టాన్ని సవరణ చేస్తూ తీసుకొస్తున్న నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని గిరిజన భాషా వాలంటీర్లను నియమించాలని కోరారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో పై సమస్యలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సిరిమల్లిరెడ్డి, సంతోష్ ఎన్నిక

ఈ మహాసభలో 24 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, పులి సంతోష్, కార్యదర్శివర్గ సభ్యులుగా పూనెం ప్రదీప్ కుమార్, బాబు బురయ్య, కారం నాగేశ్వరరావు, కాక అర్జున్ దొర, ఆఫ్క సమ్మక్క, కోండ్ల సూరిబాబు, తీగల శ్రీనివాస్, ఇరుప అర్జున్, 14 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.కిరణ్, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్, 11 మండలాల నుంచి 200 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిరిమల్లిరెడ్డి, సంతోష్

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

గ్రామాల్లో ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వీర కిషోర్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ కొండా జాకబ్ అధ్యక్షతన గ్రామంలోని షాపులు, హోటల్స్, గెస్ట్ హౌస్ యాజమాన్యులతో సోమవారం ప్లాస్టిక్‌పై అవగహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి దుకాణం ముందు చెత్తతోట్టేలను తప్పక వాడాలన్నారు. షాపులు, హోటళ్లలో ప్లాస్టిక్ వినియోగించవద్దని, అమ్మవద్దని తెలిపారు. నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుని, రూ.2వేలు నుంచి రూ.5వేలు వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మెయిన్ రోడ్డులోని ఆర్ అండ్ బి స్థలాలలో నిర్మించిన అక్రమ కట్టడాలను ఎవరికి వారు సొంతంగా తొలగించాలన్నారు. లేకుంటే నోటీసులు జారీ చేసి తామే తొలగించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బొడ్డేటి వీరబాబు పలువరు, వ్యాపారస్తులు పాల్గొన్నారు..

మాట్లాడుతున్న ఎంపిడిఒ వీర కిశోర్

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం

సిఐటియు జిల్లా నాయకులు రామరాజు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.రామరాజు అన్నారు. భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీసీతారామరాజు ఎలక్ట్రికల్ ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షులు కలవపల్లి రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. తొలిత రాజవొమ్మంగిలో భారీ ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ, కార్మికులు సమస్యల పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధి సుమారు రూ.800 కోట్లు దారి మళ్లించి కార్మికులు పొట్ట కొట్టిందని విమర్శించారు. దీంతో కార్మికులకు రావలసిన క్లైములు, ఇతర బెనిఫిట్స్ ఏవి కూడా అందడం లేదన్నారు. కరోనా సమయములో అనేకమంది భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక అర్ధాకులతో అలమటించగా, వారికి చెల్లిస్తామన్న కరువు భత్యం నేటికీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధిని వారికే ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంతో బీమా, పెన్షన్ ఇతర బెనిఫిట్స్ కల్పించాలన్నారు. అనంతరం స్థానిక డిప్యూటీ తహశీల్దార్ ఎ.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాంబాబు, రాము, వి.భద్రం, నాగు, కామరాజు, రాంబాబు, నూకరాజు, శ్రీను, బుజ్జి, అప్పారావు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నాచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

జెడ్‌పి హైస్కూల్ స్వర్ణోత్సవాలకు సన్నాహాలు

ఆహ్వాన పత్రికలు పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు మండల కేంద్రంలోని 1974 సంవత్సరంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాలకు ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన సన్నాహాలు చేస్తున్నారు. గత 48 సంవత్సరాల్లో ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఒక చోట కలుసుకొనే అపూర్వ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబర్ 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కమిటీల వారీగా పనులు ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో నాలుగు లక్షల రూపాయలతో విద్యార్థుల చిహ్నంగా ఒక పైలాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఐటిడిఎ పిఒ ఫర్మన్ అహ్మద్ ఖాన్, ఎటిడబ్ల్యూఒ కె.సుజాత, ఎంపీడీవో రవిబాబు, డీఎఫ్ఓ సాయిబాబా, స్థానిక సిఐ ఎం.అప్పలనాయుడు, ఎఎంవిఐ మోటార్ వెహికల్ అధికారి ఎస్.జగదీష్‌ను సోమవారం పూర్వ విద్యార్థుల ఆహ్వాన కమిటీ కలిసి ఆహ్వాన పత్రికలను అందజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు అంకు ప్రసాద్, పరకాల ఎస్పీ జూపల్లి శివరామయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎండి జిక్రియ, ఎస్ఎ ఆసిఫ్ గని, ఏఎల్ఎన్ మూర్తి, ఐవీ నరసింహారావు, ఎస్కే షాజహాన్, బేడే సతీష్, ఎం.సతీష్. జీవన్, ఇల్లా మురళి, ఐ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒ ఫర్మన్ అహ్మద్ ఖాన్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చిడుమూరు పంచాయతీకి ఫ్రీజర్ వితరణ

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని చిడుమూరు గ్రామపంచాయతీకి చట్టి గ్రామస్తులు కట్టం నాగేశ్వరరావు కుటుంబీకులు శవాలను భద్రపరిచే ఫ్రీజర్‌ను అందజేశారు. తల్లి కట్నం సుబ్బమ్మ, కట్టం శ్రీకాంత్ జ్ఞాపకార్థంగా నాగేశ్వరరావు కుటుంబానికి చెందిన అజయ్ ఫ్రీజర్‌ను ఉప సర్పంచ్ బొక్కిలి శాంతమ్మకు సోమవారం అందజేశారు.

ఫ్రీజర్ అందజేస్తున్న దృశ్యం

డీడీకి వినతిపత్రం అందజేస్తున్న అప్పలనర్స, ఉమామహేశ్వరరావు, తదితరులు

ఆశ్రమ పాఠశాలల్లోకి ప్రజా సంఘాల నేతలకు అనుమతి లేకుంటే..

సమస్యలు ఎలా తెలుస్తాయి ?

- గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి సర్క్యులర్‌ను రద్దు చేయాలి
- డీడీకి గిరిజన సంఘం నేత అప్పలనర్స వినతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: టిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలను పరిశీలించే ప్రజా, విద్యార్థి సంఘాలతో పాటు మీడియాకు అనుమతి లేకపోతే అక్కడి సమస్యలు, అన్యాయాలు బాహ్య ప్రపంచానికి ఎలా తెలుస్తాయని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స ప్రశ్నించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఇతరుల ప్రవేశం నిషేధమని టిడబ్ల్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ జారీ చేసిన సర్క్యులర్ రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఐటిడిఎలో టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావుకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.ప్రభుదాసు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావుతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ, ఈ సర్క్యులర్‌తో ఆశ్రమాల్లో వైఫల్యాలు, లోపాలు, డొల్లతనం బయటపడే అవకాశం లేకుండా చేయడమేనని పేర్కొన్నారు. దీంతో నిర్వాహకులు ఆశ్రమాల నిర్వహణను సక్రమంగా చేయలేదని తెలిపారు. సర్క్యులర్ ను ఆసరాగా చేసుకుని సిబ్బంది విధులను భయం లేకుండా నిర్లక్ష్యంగా నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఆశ్రమాల్లో సమస్యలపై ప్రశ్నించలేని, బయటకు చెప్పుకోలేని పరిస్థితిలో గిరిజన చిన్నారులు ఉన్నారని, సమస్యలను ఎవరు బయటకు తీసుకు వస్తారని అప్పలనర్స ప్రశ్నించారు. సుమారు 8 మండలాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 3వేల మంది విద్యార్థులను గిరిజన సంఘం పరీక్షించగా సగానికి పైగా విద్యార్థులు చర్మ వ్యాధుల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో విశాఖ వైద్య బృందాల సహకారంతో ఆశ్రమాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించేందుకు వెళ్ళగా ఐటిడిఎ పిఒ, డిడి అనుమతి తప్పనిసరని హెచ్ఎంలు చెప్పడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2016లో సుమారు 30 వేల మంది గిరిజన విద్యార్థులకు చర్మవ్యాధి నివారణకు రూ.10 లక్షలతో మందులు కొనుగోలు చేసి పాఠశాలల యాజమాన్యం సహకారంతో పంపిణీ చేశామని తెలిపారు. దాతల సహకారంతో ఆశ్రమాల్లోని గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను నిరాకరించడం ఏమిటని ప్రశ్నించారు. టిడబ్ల్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ విడుదల చేసిన సర్క్యులర్ కారణంగా దాతలు నిర్వహించే వివిధ సేవలు విద్యార్థులకు అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన చిన్నారులకు వైద్య సేవలతో పాటు వివిధ సేవలందించే ప్రక్రియను కొనసాగించేందుకు గిరిజన సంఘం, వైద్య బృందం పాఠశాలల్లో అనుమతించేందుకు పాఠశాలల హెచ్ఎంలకు తగిన ఆదేశాలను జారీ చేయాలని కోరారు.

కలెక్టర్, పిఒలకు అవార్డులు

కలెక్టర్, పిఒలకు అవార్డు అందజేస్తున్న గవర్నర్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గిరిజనులకు అందిస్తున్న సేవలకు మంచి గుర్తింపు లభించింది. విస్తతంగా నిర్వహిస్తున్న రక్త దాన శిబిరాలు, రక్త సేకరణలను పురష్కరించుకొని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాల కృష్ణలకు పురష్కారం లభించింది. ఈ మేరకు సోమవారం రాజ్ భవన్‌లో నిర్వహించిన రెడ్ క్రాస్ అవార్డు ప్రదానోత్సవంలో రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు బిశ్వ భూషణ్ హరి చందన్ చేతుల మీదుగా కలెక్టర్, ప్రాజెక్ట్ అధికారి అవార్డులు స్వీకరించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ తరుపున అందిస్తున్న సేవలకు గాను కలెక్టర్, ప్రాజెక్ట్ అధికారులను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత విస్తతంగా రెడ్ క్రాస్ సేవలను అందించాలని, రక్త నిల్వలను పెంపొందించాలని గవర్నర్ సూచించారు. వచ్చే నెలలో పాడేరు ఐటిడిఎ పరిధిలో నిర్వహించనున్న మెగా వైద్య శిభిరం, రక్తదాన శిబిరాలకు హాజరు కానున్నట్లు గవర్నర్ తెలిపారు.

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కేంద్రంలోని బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఏఎన్‌టి ఒకేషనల్ కోర్స్ చదువుతున్న కంకిపాటి హారిక అనారోగ్యంతో మృతి చెందినట్లు సోమవారం బాలిక తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ, ఈనెల 21న హారిక అస్వస్థతకు గురైందని ఈ సమాచారం తెలుసుకున్న తాము కళాశాలకు వెళ్లి సెలవు మంజూరు చేసి తమ కుమార్తెను ఇంటికి పంపించాలని కోరామన్నారు. కళాశాల యాజమాన్యం ఇందుకు అంగీకరించలేదని, తామే వైద్య సేవలు కల్పిస్తామని చెప్పడంతో వెనుతిరిగామని తెలిపారు. కుమార్తె ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఈనెల 25న వచ్చి తమతో హారికను పెదబరడ పంచాయతీ చెరపల్లి గ్రామంలో తమ ఇంటికి తీసుకువెళ్లామని చెప్పారు. వైద్యం కోసం తాము ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే హారికకు పచ్చ కామెర్లు అధికమై తీవ్ర స్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాడేరులోని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభుదాస్ స్పందిస్తూ సకాలంలో వైద్య సేవలు అందకపోవడమే మృతికి కారణమై ఉంటుందని, దీనిపై అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. హారిక మృతిపై ప్రభుత్వం బాధ్యత వహించాలని, కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కొత్తబల్లుగుడలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని సుంకరమెట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కొత్తబల్లుగుడ గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియాన్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్మని వ్యాధిగ్రస్తులకు చికిత్సలు అందించి మందులను పంపిణీ చేశారు.కొత్తబల్లుగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినిలకు పరీక్షలు చేఇ మందులను పంపిణీ చేశారు.గ్రామంలోని ఇంటింటికి తిరిగి వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించారు.గోరు వెచ్చని నీటిని వినియోగించడంతో పాటు నివాస గృహాల చుట్టు పక్కలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంహెచ్ డబ్ల్యు రాధమ్మ, హెల్త్ అసిస్టెంట్ శెట్టి ప్రభాకర్,ఏఎన్ఎం లు తులసి, నీలావతి పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

బొర్రా గుహల ఆదాయం కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి-అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల ఆదాయం పంచాయతీ వాటా కేటాయింపుపై పంచాయతీ కార్యవర్గం హర్షం వ్యక్తం చేఇసంది. పర్యాటక శాఖ నుండి బొర్రాకు వచ్చే ఆదాయంలో 25శాతం వాటా కేటాయించాలని ఈనెల 9న స్థానిక సర్పంచ్ జన్ని. అప్పారావు కలెక్టర్, పర్యాటక శాఖ ఉన్నత అధికారులకు పోస్టు ద్వారా విన్నవించారు. ఈ మేరకు రూ.25 లక్షల 39 వేలు పంచాయతీ వాటా కేటాయింపు పై హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పంచాయతీ వాటాను ప్రభుత్వం చెల్లించకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని, దీంతో, గుహల ఆందోళన చేపట్టేందుకు నిర్ణయించామని, ప్రస్తుతం కేటాయింపుతో తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నిధులతో మొదటి విడతగా తాగునీటి, పారిశుద్ధం, సిసి రోడ్లు వంటి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు కలెక్టర్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు జన్ని పొత్తి పూజారి, జయరాం, కొర్రా. నీలన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ అప్పారావు

సిఐటియు మండల కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు దాసమ్మ, ప్రసాద్

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు సిఐటియు మండల నూతన కార్యవర్గం ఎన్నిక జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ ఆధ్వర్యంలో జరిగింది. నూతన అధ్యక్షులుగా దాసమ్మ, మండల కార్యదర్శిగా కె.ప్రసాదరావు నియమితులయ్యారు, వీరితోపాటు వివిధ రంగాల నుండి మరి కొంతమందిని మండల కమిటీలో నియమించారు. కార్మిక రంగాలపై జరుగుతున్న దాడిని తిప్పి కొడతామని, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం పోరాడతామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

30న సిఐటియు మండల మహాసభ

ప్రజాశక్తి- హుకుంపేట: ఈ నెల 30 జరిగే సిఐటియు మండల మహా సభను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు సుందరరావు, కిల్లో రామారావు కోరారు. సోమవారం పలు గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు జీతం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.అన్ని వర్గాల కార్మికులు పాల్గొని మహా సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎయును సందర్శించిన నాగాలాండ్ పూర్వ మంత్రి

నాగాలాండ్ పూర్వ మంత్రిని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న ఎయు విసి

ప్రజాశక్తి- విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని నాగాలాండ్ రాష్ట్రం పూర్వ మంత్రి, విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ దోషేహా వై సెమా సందర్శించారు. ఏయూ జియాలజీ విభాగం పూర్వ విద్యార్థి అయిన సెమాను వర్సిటీ తరపున వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సత్కరించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థులు దేశ వ్యాప్తంగా తమ సామార్థ్యాలతో ఉన్న స్థానాలను అదిరోహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జియాలజీ విభాగం ఆచార్యులు ఇ.ఎన్ ధనుంజయ రావు, యుగంధర్ రావులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో ప్రభవ్ ప్రతిభ

ప్రభవ్‌ను అభినందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇటీవల నగరంలో రోలర్ స్కేటింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రోలర్ ఆల్పిన్ విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించిన ఎం.ఎన్.ఎన్.వై.ప్రభవ్‌ను లక్ష్మీనరసింహ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం దీనదయాల్‌పురంలో పలువురు అభినందించారు. వచ్చేనెల 11నుంచి 21వరకు బెంగళూరులో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షిస్తూ ప్రభవ్‌ను 13వ వార్డు వైసిపి అధ్యక్షుడు కెల్ల సత్యనారాయణ, బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రామన్న పాత్రుడు అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.రవికుమార్, పి.ఆదిమూర్తి, కార్యదర్శి పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎయులో ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీ

రోసీస్ సంస్థతో ఎయు అవగాహన ఒప్పందం

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం డ్రోన్ టెక్నాలజీకి కేంద్రంగా మారనుంది. ఏయూలో ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీ(ఐసిడిటి) ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించి ఏయూతో నగరానికి చెందిన రోసీస్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, రోసీస్ టెక్నాలజీస్ సిఈఓ ఎన్.కె వెంకట సతీష్‌లు సంతకాలు చేశారు.ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీని కలిగిన తొలి విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందన్నారు. ఈ రంగంలో విస్తృత అవకాశాలు వస్తాయన్నారు. మల్టీ బిలియన్ ఇండస్ట్రీగా డ్రోన్ టెక్నాలజీ రంగం మారుతుందన్నారు. పారిశ్రామిక స్థాయి నుంచి ఇండస్ట్రీ 4.0, డ్రోన్ టెక్నాలజీలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో పూర్తిగా యంత్ర ఆధారిత సేవలు వస్తాయన్నారు. రవాణా వ్యవస్థ తన స్వరూపాన్ని పూర్తిగా మార్చుకుంటుందన్నారు. డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ, పరిశోధన, కన్సల్టెన్సీలు అందించే కేంద్రంగా ఐసిడిటి నిలుస్తుందన్నారు. ఏయూలో నూతనంగా ఏర్పాటైన హెలిపాడ్ మైదానాన్ని డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ అందించడానికి వినియోగిస్తామన్నారు. రోసీస్‌సంస్థ సిఈఓ ఎన్.కె వెంకట సతీష్ మాట్లాడుతూ వ్యవసాయ, బధ్రత రంగాలకు డ్రోన్‌లు పెద్ద వనరుగా మారుతాయన్నారు. సుశిక్షితులైన నిపుణులను ఈ రంగానికి అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌టిడి విశాఖ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఓ.ఆర్.ఎం రావు, రోసీస్ సంస్థ సిఓఓ డి.అఖిలేష్ రెడ్డి, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, డీన్లు ఆచార్య ఎన్.కిషోర్ బాబు, ఆచార్య కె.రమాసుధ,ఆచార్య కె.బసవయ్య,ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

9,10 తేదీల్లో మధ్యవర్తిత్వంపై అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి- విశాఖపట్నం:నూతన శతాబ్దిలో మధ్యవర్తిత్వం ద్వారా న్యాయ పరమైన వివాదాలను పరిష్కరించుకునే పద్ధతులపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గీతం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో రానున్న డిసెంబర్ 9,10వ తేదీలలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.అనితారావు తెలిపారు. ప్రపంచంలోని అధిక శాతం దేశాలలో కోర్టులలో కేసుల సంఖ్య పెరుగుతుండటం వాటిపై తీర్పులు వెలువరించడంలో జాప్యం జరుగుతోందని ఈ కారణంగా వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలను న్యాయస్థానాలు సూచిస్తున్నాయని తెలిపారు. దీనిపై అవగాహన పెంచడానికి "మీడియేషన్ యాజ్ మోడ్ ఆఫ్ సెటిల్మెంట్ ఆఫ్ డిస్ప్యూట్స్ ఇన్ ది న్యూ మిలియనియం" పేరిట రెండు రోజుల పాటు దేశ, విదేశీ న్యాయ నిపుణులతో అంతర్జాతీయ వెబినార్‌ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ సదస్సులో మధ్యవర్తిత్వం ద్వారా శాంతి స్థాపన, కుటుంబ మరియు వైవాహిక సంబంధ వివాదాలు, వాణిజ్య అంశాలలో మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారం, ఈ-మీడియేషన్, ఈ-ఆర్బిట్రేషన్, మధ్యవర్తిత్వం వహించడంలో ఎదురయ్యే సవాళ్ళు, అంతర్జాతీయ వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం ప్రాధాన్యత వంటి అంశాలను నిపుణులు చర్చిస్తారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయ మూర్తి లావు నాగేశ్వరరావు డిసెంబర్ 8వ తేదీన కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. ఈ అంతర్జాతీయ వెబినార్‌లో హాంకాంగ్ మీడియేషన్ సెంటర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఫ్రాన్సిస్కో, యుకె లా స్కూల్ డిప్యూటీ అధిపతి ప్రొఫెసర్ బ్రెయాన్ క్లార్క్, జర్మనీకి చెందిన మీడియేషన్ శిక్షకుడు సమీర్‌షా, న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి అనుబంధ మేధోశక్తుల విభాగం మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.రామారావు, సింగపూర్ లోని ప్రముఖ ఆర్బిట్రేటర్ అజిత్ శ్రీ బలి సామినాథన్, జార్జియాలోని మీడియేషన్ మరియు ఆర్బిట్రేషన్ సంస్థ ప్రతినిధి ప్రజ్ఞా అర్య, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.యతిరాజులు, జిందాల్ గ్లోబల్ లా స్కూల్ అసిస్టెంట్ డైరెక్టర్ వాసిక్ అబ్బాస్ ధర్ పాల్గొని ప్రసంగిస్తారని వెల్లడించారు. ఈ సదస్సులో న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులు, బోధించే అధ్యాపకులు, పరిశోధకులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకుని హాజరుకావచ్చునని సూచించారు.

క్రికెట్ విజేత హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ జట్టు

విజయం సాధించిన హెచ్‌పిసిఎల్ క్రికెట్ జట్టు

ప్రజాశక్తి - ములగాడ : హెచ్‌పిసిఎల్ ఆల్ ఇండియా ఇంటర్ యూనిట్ క్రికెట్ టోర్నీలో కెప్టెన్ పి.వెంకటపతి రాజు నేతృత్వంలోని విశాఖ రిఫైనరీ జట్టు చాంఫియన్‌గా నిలిచింది. ముంబైలో ఈనెల 24 నుంచి 26వరకు నిర్వహించిన టోర్నీలో 12జట్లు పాల్గొనగా, ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించిన విశాఖ రిఫైనరీ జట్టు, ఫైనల్‌లో నార్త్‌జోన్ జట్టుపై 31పరుగుల తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. విజేత విశాఖ రిఫైనరీ జట్టు ఫైనాన్స్, హెచ్‌ఆర్ డైరెక్టర్ రజనీష్ నారంగ్ నుంచి ట్రోఫీని అందుకున్నారు. విజేత విశాఖ జట్టును ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇన్చార్జ్ వి.రతన్‌రాజ్ అభినందించారు. టీమ్ మేనేజర్ మిస్టర్ జాన్ చెరియన్, మేనేజర్ హెచ్‌ఆర్, ఛాంపియన్ టీమ్ సభ్యులు ఎస్. రాజశేఖర్, బిఎస్ రాఘవేంద్ర, ఇఆర్ఎమ్ రెడ్డి, వివేక్ సింగ్ (ఉత్తమ బ్యాట్స్‌మెన్), పి మోహన్ కుమార్ (ఉత్తమ బౌలర్ మరియు మ్యాన్ ఆఫ్ ది ఫైనల్స్), అభిషేక్ ఎస్. నిరంజన్, ఎం.కే చౌహాన్, ఎన్. భద్ర, పీ .వి సంజయ్ కుమార్, కే. సుధీర్ రాజ్, ఎం.ఎఫ్ హఫ్నాస్, వై. హేమంత్, ఎస్. హరి, పి.వెంకట కుమార్‌లను హెచ్‌పిసిఎల్ సిజిఎం (హెచ్‌ఆర్) వి.నగేష్ అభినందించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

అంబేద్కర్ కూడలి వద్ద నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి -పెదబయలు రూరల్:పెదబయలు వారపు సంతలో పలు గ్రామాల నుంచి వచ్చే వాహనాలతో సోమవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో అరగంటకు పైగా ద్విచక్ర వాహనాలు, అటో, వ్యాన్, లారీ తదితర వాహనాలు నిలిచి పోయాయి. పాదచారులకు నడిచి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పోలీస్‌లు స్పందించి సంతలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని పలువురు కోరారు.

పాఠశాలలో అవగాహన సదస్సు

మాట్లాడుతున్న సిడిపిఒ

ప్రజాశక్తి హుకుంపేట::ఆడపిల్లలపై అత్యాచారాలు ప్రతి ఒక్కరూ ఆపాలని సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ పాఠశాలలో సమాజంలో మహిళలపై జరుగుతున్న హత్యలు, హింస, తదితర అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సిహెచ్ బాలామణి దేవి మాట్లాడుతూ, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు ఆపాలని, మహిళా చట్టాలను అమలు చేయాలన్నారు.వచ్చే నెల 23 వరకు లింగ వివక్షతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం చిన్నారావు, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వణికిస్తున్న చలి

చలి మంట వద్ద ఉపశమనం పొందుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-పెదబయలు రూరల్: మండలంలో చలి తీవ్రత పెరగడంతో గిరిజనులు వణికి పోతున్నారు. ఉదయం 10 గంటలైనా మంచు వీడక పోవటంతో వారపు సంతలో వచ్చిన ప్రజలు గజగజా వణుకి పోయారు. కొందరు తలలకు గట్టిగా ఉన్ని దుస్తులు ధరించారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో చిన్న పిల్లలకి జలుబు, జ్వరం వంటి వాటితో బాధపడుతున్నారు.

గృహ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియుఐ డొమెస్టిక్ వర్కర్స్ ఆధ్వర్యంలో సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కె.లక్ష్మి, జి.వెంకటలక్ష్మి, జి.బాలభాను మాట్లాడుతూ గృహ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పది సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూ విన్నపాలు, విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గృహ కార్మికులకు సమగ్ర చట్టం లేనందున దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వెలుబుచ్చారు. వారందరికీ ఇఎస్ఐ సదుపాయం కల్పించాలని, అర్హులకు ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహ సంబంధ పనులు చేసే వారందరినీ రిజిస్టర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.వెంకటలక్ష్మి, డి.సురేష్ బాబు, లండా ఎర్రమ్మ, మైలపల్లి మోహిని, బి.మౌనిక, బి.మాణిక్యం, జి.కనకమ్మ, కె.మంగమ్మ పాల్గొన్నారు.

606వ రోజుకు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను భేషరతుగా విడనాడాలని మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నాయకులు ఈసర లక్ష్మి, కె.జయమ్మ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారానికి 606వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. నిర్వాసితులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. మిగులు భూములను నిర్వాసితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం మార్చుకోకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో బి.కళావతి, ఎ.దాలమ్మ, ఆర్.కల్పన, ఎన్.లక్ష్మి, ఆర్.కనక, ఆర్.అప్పారావు, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలకు జనసేన ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిబిసిఎంసికి చెందిన 18,390 గజాల స్థలం, సోషల్ వెల్ఫేర్‌కు చెందిన 3600 గజాల స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, ఈ స్థలాల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట జనసేన పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్పందనలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆ పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ఎంపీ ఎంవివి సత్యనారాయణ, వైజాగ్ స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ జీవీ కలిసి సిబిసిఎన్‌సి, సోషల్ వెల్ఫేర్ స్థలాలను కాజేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తక్షణమే టిడిఆర్ రద్దుచేసి, అక్రమార్కులకు సహకరించిన కమిషనర్ రాజాబాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస పట్నాయక్, శివప్రసాద్, రామకృష్ణ, కృష్ణ, రవి, రూప, శ్రావణి పాల్గొన్నారు.

జెసికి ఫిర్యాదు

సాంఘిక సంక్షేమ శాఖకు జిఒ 99/2009 ద్వారా గతంలో కేటాయించిన 3500 చదరపు గజాల భూమిని ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణదారులుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా దళిత సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో జాయింట్ కలెక్టర్‌కు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో విదసం నాయకులు ఎస్ఆర్.వేమన, కోల హరిబాబు పాల్గొన్నారు.

అటవీ భూముల పరిరక్షణకు వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అటవీ శాఖకు చెందిన భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ స్పందనలో ఆయన వినతిపత్రం సమర్పించారు. విశాఖ నగరంలోని అటవీ శాఖకు చెందిన వందల కోట్ల విలువైన భూములపై బడాబాబులు కన్నుపడిందన్నారు. ఆ క్రమంలోనే అధికార పార్టీ ముఖ్య నేతల అండతో ఆ భూముల్లో ఆకస్మాత్తుగా సర్వే సాగిన తీరుపై అన్ని ప్రధాన వార్తా పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయని తెలిపారు.

30న కెఎన్ఆర్ ట్రస్టు వార్షికోత్సవం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలు, ట్రస్టు చైర్మన్ కందుల నాగరాజు జన్మదిన వేడుకలను ఈ నెల 30వ తేదీన ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ కందుల నాగరాజు వార్డు కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా దశాబ్దాల కాలంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ ఏడాది వార్షికోత్సవం సందర్భంగా పది వేల మంది మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నామని తెలిపారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా

నినాదాలు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న కొండపోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ మండలంలోని బడదనంపల్లి పంచాయితీ కొత్తవీధి గ్రామానికి చెందిన గిరిజనులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ కొత్తవీధి గ్రామంలో 53 కుటుంబాలకు చెందిన సుమారు 250 మంది జనాభా నివసిస్తున్నారని, వారిలో 60 మంది రైతులు సుమారు 100 ఎకరాలకుపైగా కొండపోడు భూమి సాగు చేస్తున్నారని తెలిపారు. పదిమంది రైతులకు 2021లో 20 ఎకరాలు భూమికి పట్టాలు ఇచ్చారని, రైతులకు నేటికీ పట్టాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సాగు చేస్తున్న కొండబోడు భూములకు గతంలో సర్వేలు కూడా నిర్వహించారన్నారు. తక్షణమే తమకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని లబ్బర్తి ఎంపిటిసి, టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ తహసిల్దార్ ఎ.సత్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దొడ్డంరెడ్డి చిన్నతల్లి, చల్లా సీతాదేవి, భోనెం సత్తిబాబు, డి సరోజిని, ఎస్ బోడబ్బాయి, చల్లా దేవుడు, డి శివప్రసాద్ పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షకు మాజీ ఎమ్మెల్యే మద్దతు

దీక్షల్లో కూర్చున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

ప్రజాశక్తి-చింతూరు

విఆర్.పురం మండలానికి చెందిన రామవరం, రామవరప్పాడు నిర్వాసిత గ్రామ ప్రజలు చింతూరు ఐటిడిఎ ఎదుట చేస్తున్న రిలే నిహాహార దీక్షలు సోమవారం నాటికి 6వ రోజుకు చేరాయి. ఈ దీక్షా శిబిరాన్ని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి సోమవారం సందర్శించి సంఫీుభావం తెలియజేశారు. ఈ సందర్భంగామామె మాట్లాడుతూ రామవరం గ్రామంలోని 270 కుటుంబాలకు సర్వే నిర్వహించి పరిహారం చెల్లించాల్సిన ప్రభుత్వం అరకొర సర్వే నిర్వహించి 104 కుటుంబాలు పోలవరం పరిహారానికి నోచుకోకుండా చేయడం దారుణమన్నారు. ఆర్ అండ్ ఆర్ సర్వేలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, ముంపులో ఉన్న ప్రాంతాలను గ్రామాలను కూడా సర్వే చేయకుండా వదిలేసి తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిర్వాసితుల న్యాయమైన పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని, ప్రభుత్వం అధికారులు దిగి వచ్చేంతవరకు దీక్షలను కొనసాగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ చింతూరు మండల అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, విఆర్ పురం మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, టిడిపి నాయకులు మల్లెల్లి వెంకటేశ్వరరావు, పొదిలి రామారావు, రామవరం, రామవరంపాడు నిర్వాసితులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-అడ్డతీగల

అడవి జంతువుల నుంచి రక్షణకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన వై.రామవరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వై.రామవరం మండలం సింహాద్రి పాలేనికి చెందిన యాట్ల శ్రీరాములరెడ్డి (51) యాట్ల సంకుర్ రెడ్డి (25) సింహాద్రిపాలెం గ్రామం నుండి బులోజుపాలెం వెళుతుండగా మార్గమధ్యలో అడవి జంతువులకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె వారికి తగిలింది. ఈ ప్రమాదంలో శ్రీరాముల రెడ్డి అక్కడే మృతి చెందారు. సంకుర్ రెడ్డికి తీవ్ర గాయాలు ఆయన్ను అడ్డతీగల ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు వై.రామవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడ్డతీగల సీఐ వై.రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ రాంబాబు, ఎస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ అడవి జంతువుల వేట కోసం ఎవరైనా విద్యుత్తు, ఏ ఇతర పరికరాలు వాడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పిఒ సూరజ్ గనోరేకు సమస్యలను వివరిస్తున్న నాయకులు

ఐదో రోజుకు నీటి సరఫరా కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

సత్య సాయిబాబా వాటర్ సప్లై వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని రంపచోడవరం ఐటిడిఎ చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి ఐదు రోజులకు చేరాయి. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వాణిశ్రీ, వల్లపు వెంకట్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న పది నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని, రెండు సంవత్సరాల ఈఎస్ఐ, పీఎఫ్ బకాయి కట్టాలని, ఇతర సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీనికి ప్రాజెక్ట్ అధికారి సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడతానని చెప్పారు. సమస్యలు పరిష్కరించేంతవరకు ఆందోళన కొనసాగుతుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదులో అక్రమాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనిపై ఎన్నికల కమిషన్ విచారణ జరిపించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గంలో మొదట దశలో నమోదైన ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించిందని, నమోదు ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని తెలిపారు. అనర్హులను పథకం ప్రకారం వైసిపి నమోదు చేయించిందన్నారు. ఓటర్ల నమోదులో జరిగిన అక్రమాలపై విచారణ, పరిశీలన ప్రక్రియను ప్రత్యేక ఐఎఎస్ అధికారి ఆధ్వర్యంలో జరిపించాలని కోరారు. పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటరు నమోదు చివరి రోజున అనగా నవంబర్ 7న ఒక్కరోజులోనే 87 వేల ఓట్లు నమోదయ్యాయని, వీటిపై దృష్టి పెట్టాలని కోరారు. 2 లక్షలా 43 వేలా 903 మంది ఓటర్లుగా నమోదైనట్టు అధికారులు ప్రకటించారన్నారు. అర్హులైన ఓటర్లు వేల సంఖ్యలో నమోదుకు నోచుకోలేదన్నారు. డిగ్రీ అర్హత లేని వారి పేర్లు వేల సంఖ్యలో డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉన్నాయని తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్ లేని వారిని నమోదు చేశారన్నారు. పదో తరగతి, ఐటిఐ, పాలిటెక్నిక్ సర్టిఫికెట్లు కలిగిన వారిని కూడా ఓటర్లుగా చేర్పించారన్నారు. 2019 అక్టోబర్ 30 తర్వాత అనగా 2020, 2021 2022 సంవత్సరాలలో డిగ్రీ పాసైన వారిని కూడా ఓటర్లుగా నమోదు చేశారన్నారు. ఇటువంటి వారు వేల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. అంతేగాకుండా ఒక వ్యక్తి 2 నుంచి 5 సార్లు ఓటరు జాబితాలో నమోదయ్యారన్నారు. ప్రతి బూతులో ఇటువంటివి 50 నుంచి 80 వరకు ఉన్నాయని తెలిపారు. ఇదంతా ఒక పథకం ప్రకారం కుట్రతో జరిగిందన్నారు. అన్ని అర్హతలూ ఉండి గెజిటెడ్ సంతకంతో ఆఫ్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిని ఎటువంటి పరిశీలనా జరగకుండానే తొలగించారన్నారు. డిజిగ్నేటెడ్ ఆఫీసర్ దరఖాస్తు పరిశీలించి, ఎక్నాలెడ్జిమెంట్ కార్డు ఇచ్చినా నమోదు చేయలేదన్నారు. విశాఖ జిల్లాలో వేల సంఖ్యలో అర్హత ఉన్న వారి దరఖాస్తులను దురుద్దేశంతోనే నమోదు చేయలేదన్నారు. తిరస్కరించబడిన వారి వివరాలతో కూడిన ఓటరు జాబితాను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనివల్ల అభ్యంతరాలు చెప్పడానికి, తిరిగి నమోదు చేసుకోవడానికి మార్గం సులభతరమవుతుందన్నారు. ఓటర్ల అప్లికేషన్లు, డిగ్రీ సర్టిఫికెట్లతో పాటు ఏ సంవత్సరంలో డిగ్రీ పాసయ్యారో తెలిపే వివరాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ఎక్సెల్ ఫార్మెట్లో పెట్టాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదైన ఎక్కువ దరఖాస్తులను బిఎల్‌ఒలు వైసిపి నాయకుల ఒత్తిడితో వెరిఫికేషన్ చేయలేదన్నారు.